క్లుప్తంగా

కస్తూరిబా పాఠశాల సందర్శన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను జిల్లా విద్యాధికారి యాదయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలిస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాబోవు వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు కల్పించాలన్నారు. అనంతరం పాఠశాలలోని వంటగది సౌకర్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ నియామకం



నియామకపత్రం అందజేస్తున్న రఘునాథ్

నస్పూర్: బీజేపీ పట్టణ కమిటీని జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా ఎస్.రమేశ్, ప్రధాన కార్యదర్శులుగా ఈర్ల సదానందం, పొన్నవేణ సదయ్య, కుర్రె చక్రవర్తి, యువమోర్చా అధ్యక్షుడిగా రాగిడి రవి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా సిరికొండ రాజు, బీసీ మోర్చా అధ్యక్షుడిగా బద్రి శ్రీకాంత్, పలువురిని ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులుగా నియమించారు. కార్యక్రమంలో నాయకులు రజనీష్‌జైన్, దుర్గం అశోక్, కమలాకర్‌రావు, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడిలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న జీఎం, నాయకులు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని ఆర్కే 1ఏ గని సమీపంలో గల పాలవాగు ఒడ్డున నిర్వహించనున్న సమ్మక్క జాతర సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గని సమీపంలోని పోచమ్మ గుడిలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఏరియా జీఎం మనోహర్ పాల్గొన్నారు. ఈ నెల 21 నుంచి 24వరకు నిర్వహించే జాతరలో కార్మిక కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఆర్కే1ఏ మేనేజర్ జయంత్‌కుమార్, కేకే5 వెల్ఫేర్ ఆఫీసర్ కార్తీక్, ఏఐటీయూసీ నాయకులు అక్బర్‌అలీ, సలేంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు బంద్

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో గురువారం నుంచి తాత్కాలికంగా పత్తి కొనుగోళ్ల బంద్ చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. తిరిగి పత్తి కొనుగోళ్ల ప్రారంభించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు సహకరించాలని కోరారు.

మెరిట్ జాబితా ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యుఆర్ఎస్)లో ఖాళీగా ఉన్నా వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను డీఈవో కార్యాలయం వద్ద ప్రదర్శించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 15నుంచి 17వరకు అభ్యర్థులు అప్పీలు చేసుకోవచ్చన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దెర్ల సతీష్, జాబ్రీ హబీబ్, గొడిసెల శంకర్, జిలకర వెంకటి, మాద్దుల దుర్గయ్య, పద్మ, రజిత, శ్రీలత, రాజు, సాబీర్ పాల్గొన్నారు.



మోడు వారినా.. అందమే..!

ప్రకృతి వరప్రసాదమైన అడవిలో ఏర్పాటు చేసిన మైసమ్మ కుంటలో చెట్లు ఎండిపోయాయి. నీటిలో చెట్లు మోడివారినా అందం తగ్గడం లేదు. ఇందన్‌పల్లి అటవీ డివిజన్‌లోని మైసమ్మ కుంట వద్ద నీటిలో మోడు వారిన చెట్లు నీటిలో, నింగిలో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అయితే పర్యాటకులను ఆకట్టుకునే నీటిలో వెదురు వంతెన శిథిలావస్థకు చేరింది. - జన్నారం

ఘనంగా వసంత పంచమి

- చిన్నారులకు అక్షరాభ్యాసం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన ప్రజలు



బెల్లంపల్లి: అక్షరాభ్యాసానికి హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

బెల్లంపల్లి: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లిలో చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం జరిగింది. పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. చిన్నారులను పెద్దఎత్తున తీసుకొచ్చి తల్లిదండ్రులు వేద పండితులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో దాదాపు 100కు పైగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. సరస్వతీ దేవికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిట్టి చేతులతో చిన్నారులు అఆలు దిద్ది కేరింతలతో అక్షర భ్యాసం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కొడిప్యాక విద్యాసాగర్, మంచిర్యాల అకాడమిక్ ఇంచార్జీ పూదరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తల్లిదండ్రులు, చిన్నారులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలోని రాంపూర్ శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో బుధవారం వసంత పంచమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని అక్షరాభ్యాస కార్యక్రమం కనుల పండవగా నిర్వహించారు. శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేకంగా అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టగా 12మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు హాజరు కాగా గణపతి, గౌరీ పూజలు చేయించారు.

లక్సెట్టిపేట: స్థానిక శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య హాజరయ్యారు. మహిళలు పెద్దమొత్తంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం కాల్చారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేపించారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో వసంత పంచమి సందర్భంగా బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. నరహరిశర్మ, బాలకృష్ణ శర్మల ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఈవో ముక్తా రవి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: వసంత పంచమిని పురస్కరించుకుని స్థానిక పాఠశాలల్లో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాలలో సరస్వతీ మాతా పూజా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జోబిన్ పిల్లలతో అక్షరాలు దిద్దించారు. అల్ఫోర్స్ పాఠశాలలో వసంత పంచమిలో భాగంగా సరస్వతీ పూజ నిర్వహించారు. విద్యార్థుల భజనలు అలరించారు. సరస్వతీస్తోత్రమ్ పఠించారు.

తాండూర్: వసంత పంచమి వేడుకలను విద్యా భారతి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాన్ని ముగ్గులతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. సేవా జ్యోతి శరణాలయంలో వసంత పంచమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, తిరుమలేశ్వరి, విద్యాభారతి విద్యా సంస్థల డైరెక్టర్ సురభి శరత్ కుమార్, సేవా జ్యోతి శరణాలయ నిర్వాహకులు గజ్జెల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ–3 అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ పద్మ అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు లత తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: వసంతపంచమి సరస్వతీ దేవి పుట్టిన రోజుని పురస్కరించుకుని కోటపల్లి ఉషోదయ పాఠశాలలో అంగరంగవైభవంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో 50మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించినట్లు హెచ్‌ఎం ఉమారాణి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, తిరుపతి పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని అర్చకులు శంకర్‌శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 42మంది చిన్నారులు అక్షర శ్రీకారం చేసినట్లు ప్రధానాచార్యులు తెలిపారు. చిన్నారులు తల్లిదండ్రులు, ప్రబంధ కారిణిలు పాల్గొన్నారు.



కోటపల్లి: దేవతల వేషధారణలో విద్యార్థులు



తాండూర్‌లో...



మంచిర్యాలఅర్బన్: శ్రీచైతన్య పాఠశాలలో...

సమ్మె విజయవంతం చేయండి



గుండ్లసోమారంలో నిర్వహించిన ఎడ్లబండి ర్యాలీలో పాల్గొన్న ఏఐకేఎంఎస్ నాయకులు

నెన్నెల: దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా మండలంలోని గుండ్లసోమారంలో బుధవారం ఎడ్లబండి ర్యాలీ నిర్వహించారు. రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు తిరుపతి, జిల్లా నాయకులు దుగుట రెడ్డి, రాజక్క, గంగారాం, గున్నక్క, బక్కయ్య పాల్గొన్నారు.

భీమారం: సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొనాలని హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కోరారు. థర్మల్ పవర్ ప్లాంట్‌లో భూనిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

పాతమంచిర్యాల: సివిల్ సప్లై హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు అన్నారు. సివిల్‌సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి బుధవారం సివిల్ సప్లై డీఎం గోపాల్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సివిల్ సప్లై హమాలీవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దేవరాజ్ భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

మంచిర్యాలఅర్బన్: బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజాకార్మిక, రైతాంగ విద్య వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఢిల్లీలో రైతులు, యువకులు, విద్యార్థులపై టియర్‌గ్యాస్ ప్రయోగించటాన్ని విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, సన్నీగౌడ్, సిద్దార్థ,అన్వేష్ రాకేష్‌లు తీవ్రంగా ఖండించారు.

సమ్మక్కతో జోగు లగ్నం



సమ్మక్కతో పెళ్లి తంతు నిర్వహిస్తున్న దేవుడమ్మ

నెన్నెల: మండల కేంద్రంలోని పోచమ్మ వాడకు చెందిన జంబి ధర్మయ్య అనే శివసత్తు సమ్మక్క పట్నం వేసి అంగరంగ వైభవంగా సమ్మక్కతో జోగులగ్నం చేసుకున్నట్లు పెళ్లి తంతు నిర్వహించారు. శివసత్తు ధర్మయ్య కాళ్లకు మట్టెలు, చేతికి గాజులు తొడిగి స్త్రీ, పురుష బేధం లేకుండా చీర కట్టించారు. త్రిషూలం, కడ్నం చేతికి ఇచ్చి దేవుడమ్మ (స్వరూపమ్మ) ఆధ్వర్యంలో వివాహ తంతు నిర్వహించారు. సమ్మక్క ప్రతిమలకు దేవుడమ్మ తాళి కట్టారు. బోనాలు ఎత్తుకొని ఆటపాటలతో శివసత్తులు నృత్యాలు చేస్తూ సమ్మక్క, పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఏటలు(మేకలు), కోళ్లు కోసి ధర్మయ్య ఇంటి వద్ద ఎల్లమ్మ ఆలయం వద్ద విందు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివసత్తులు గట్టయ్య, చిన్నన్న, నాగలక్ష్మి, అశోక్, ప్రభావతి, శంకరయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'ఐక్యంగా ఉందాం'

జన్నారం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా ఐక్యంగా ఉండి గెలిపించుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, సీనియర్ నాయకుడు ఏనుగు శుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు.

21లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

దండేపల్లి: వచ్చే ఏప్రిల్, మే నెలలో జరిగే ఓపెన్ టెన్త్ ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకులు ఈ నెల 21లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శంకరగౌడ్,, సహాయ కో ఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల క్రితం ప్రవేశం పొంది ఫెయిల్ అయిన వారు, పరీక్షలు రాయని వారు కూడా పరీక్ష ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నం: 8309769067, 9866110308 లో సంప్రదించవచ్చన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

కోటపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ మంత్రి సురేఖా అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఇటీవల ఎంపీడీవో బదిలీపై వెళ్లగా ఎంపీపీ, ఎంపీటీసీలు, మండల అధికారులు హాజరై సమావేశం నిర్వహించారు. ఏవో మహేందర్ వ్యవసాయశాఖ ఎజెండాను చదివి వినిపించారు. ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలపై, ప్రణాళికపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీవో అక్తర్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కబడ్డీ క్లబ్ ప్రారంభం

నస్పూర్: పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్యసాధన కబడ్డీ క్లబ్‌ను బుధవారం ప్రారంభించారు. జిల్లాలో ఉత్సాహవంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి వారికి నాణ్యమైన శిక్షణను అందించి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతామని నిర్వాహకులు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్లకు సన్మానం

జన్నారం/నెన్నెల: నెన్నెల తహసీల్దార్‌గా చేసిన ఇమ్రాన్‌ఖాన్‌ను, జన్నారం తహసీల్దార్‌గా చేసిన వేణుగోపాల్‌ను బుధవారం రెవెన్యూ సిబ్బంది సన్మానించి వారికి వీడ్కోలు పలికారు.

'సమాచారం ఇవ్వనందుకు ఫిర్యాదు'

వేమనపల్లి: తాను అడిగిన సమాచారం ఇవ్వకుండా ఏడాదిగా మండల వ్యవసాయాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని గొర్లపల్లి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌గౌడ్ జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు.

బదిలీ డీఎల్‌పీవోలకు సన్మానం



అదనపు కలెక్టర్‌తో డీఎల్‌పీవోలు, ఎంపీవోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా నుంచి బదిలీపై ఇతర జిల్లాకు వెళ్తున్న మంచిర్యాల డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, బెల్లంపల్లి డీఎల్‌పీవో ఫణిందర్‌రావులను బుధవారం ఎంపీవోల సంఘం, పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఆధ్వర్యంలో మంచిర్యాల ఐడీఓసీలో ఘనంగా సన్మానం చేశారు. మండల పంచాయతీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపు ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి(డీపీ) వెంకటేశ్వర్‌రావుల సమక్షంలో బదిలీ డీఎల్‌పీవోలను ఘనంగా సన్మానించారు. జిల్లాకు బదిలీపై వచ్చిన మంచిర్యాల డీఎల్‌పీవో ధర్మారావు, బెల్లంపల్లి డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్‌లను కూడా ఈ సందర్భంగా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ... అధికారులకు బదిలీలు సహజమని, ఎక్కడ పనిచేసినా మంచి పేరుతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎంపీవోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్‌అలీ, కోశాధికారి సఫ్దర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్ ప్రారంభం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో బుధవారం శ్రీ లక్ష్మీనారాయణ ఆర్ట్స్ బ్యానర్‌పై దీవెన ఇంటర్నేషనల్ మూవీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో దర్శకులు తిరువపతి వర్మ దర్శకత్వంలో నిర్మించే కోటపల్లి పోలీస్‌స్టేషన్ సినిమా షూటింగ్ ప్రారంభించారు. ప్రొడ్యూసర్ సీహెచ్ దినపతిరెడ్డి క్లాప్స్ కొట్టి హీరో, హీరోయిన్‌ల సన్నివేశాలను ముహూర్తం షాట్‌గా చిత్రీకరించారు.

తహసీల్దార్ల బాధ్యతలు స్వీకరణ



శ్రీనివాస్



ఇమ్రాన్ ఖాన్



సదానందం



రాజమనోహర్‌రెడ్డి

భీమారం/నస్పూర్/తాండూర్: జిల్లాలో పలువురు తహసీల్దార్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భీమారం మండల తహసీల్దార్‌గా సదానందం, నస్పూర్ తహసీల్దార్‌గా పిప్పరి శ్రీనివాస్, తాండూర్ తహసీల్దార్‌గా ఇమ్రాన్‌ఖాన్, జన్నారం తహసీల్దార్‌గా రాజమనోహర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని నూతన తహసీల్దార్లు హామీ ఇచ్చారు.

చెన్నూర్ నాయబ్ తహసీల్దార్‌గా సనత్

చెన్నూర్: చెన్నూర్ నాయబ్ తహసీల్దార్‌గా సనత్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నస్పూర్ నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సనత్ చెన్నూర్‌కు బదిలీపై రానున్నారు.

ఎంపీడీవోలు...



భీమిని: స్వాగతం పలుకుతున్న ఎంపీవో, సిబ్బంది



శశికళ



మధుసూదన్



ప్రసాద్

దండేపల్లి/జన్నారం/బెల్లంపల్లిరూరల్/భీమిని/కాసిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ల్లాలో పలువురు ఎంపీడీవోలు బుధవారం బాధ్యతలు స్వీకరించగా, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సన్మానించారు. దండేపల్లి ఎంపీడీవోగా జాగర్లముడి ప్రసాద్, జన్నారం ఎంపీడీవోగా శశికళ, బెల్లంపల్లి ఎంపీడీవోగా ఆర్.మహేందర్, భీమిని ఎంపీడీవోగా గంగా మోహన్, కాసిపేట ఎంపీడీవోగా సత్యనారాయణ సింగ్, హాజీపూర్ ఎంపీడీవోగా యూ.మధుసూధన్ బాధ్యతలు స్వీకరించారు.

హాజీపూర్ ఎస్సైగా సురేశ్



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ఎస్సైగా గోపతి సురేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందిన సురేశ్ 2020ఎస్సై బ్యాచ్ కాగా గతంలో శిక్షణ ఎస్సైగా కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. ఆపై పూర్తి స్థాయి ఎస్సైగా మొదటిసారిగా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్, ఆ తర్వాత కన్నెపల్లి, కోటపల్లి పోలీస్ స్టేషన్‌లలో పనిచేసి తాజాగా హాజీపూర్ ఎస్సైగా బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

అధికారుల బదిలీలు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజును పెద్దపల్లి జిల్లా రామగుండం సెక్రెటరీగా, సూర్యాపేట జిల్లా నేరెడుచెర్ల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఎస్.వెంకటేశ్వర్లును మందమర్రి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మందమర్రి ఎంపీడీవోగా ఎస్.రాజేశ్వర్‌ను, డిప్యూటీ తహసీల్దార్‌గా పీ.రవీందర్‌ను నియమిస్తూ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

నస్పూర్ మున్సిపల్ కమిషనర్ బదిలీ

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ కమిషనర్ టీ.రమేశ్ సిద్దిపేట జిల్లా చేర్యాలకు కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. కాగా రంగారెడ్డి జిల్లా అమంగల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్.సతీష్ ఇక్కడికి కమిషనర్‌గా బదిలీపై రానున్నారు.

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు

మంచిర్యాలక్రైం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత మాసోత్సవాలు బుధవారంతో ముగిసాయి. జిల్లా రవాణ శాఖ కార్యాలయంలో ఎంవీఐ వివేకానంద్ రెడ్డి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్‌ల వద్ద డ్రైవర్లకు ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్, వాహనదారులు, రవాణా శాఖ సిబ్బంది, ట్రాఫిక్ ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

హోటల్ నార్త్ ఇన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కొక్కిరాల సురేఖ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద హోటల్ నార్త్ ఇన్‌ను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యాజమాన్యం మాట్లాడుతూ.. హైదరాబాద్ తరహాలో ఏర్పాటు చేశామని, రుచికరమైన వంటకాలు, భోజన ప్రియులకు కావాల్సిన అన్ని రకాల వంటకాలు అందించడానికి హోటల్ నార్త్ ఇన్ సిద్ధమైందని తెలిపారు. బర్త్ డే, మ్యారేజ్ డే పార్టీలు, శుభకార్యాలు ఒకేచోట నిర్వహించుకునేలా, అతిథులు ఉండడానికి విశాలమైన గదులు, సమావేశాల నిర్వహణకు హాల్, ఫిట్‌నెస్ కోసం జిమ్, స్విమ్మింగ్‌పూల్, తదితర సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, నల్లాల ఓదెలు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, నీలి శ్రీనివాస్, నల్ల మల్లయ్య, హోటల్ యాజమాన్యం నల్ల శ్రీనివాస్, ఓలేటి సీతారామయ్య, రాంపెల్లి వెంకటరమణాచారి, సురేష్‌కుమార్ మర్దా తదితరులు పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

మంచిర్యాలక్రైం: ఈ నెల 16న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం కలెక్టర్ బదావత్ సంతోష్, అడిషనల్ కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు రాహుల్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

మంచిర్యాలక్రైం: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుదమల్ల అశోక్‌తేజ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యధర్శి ఆవునూరి గోపాల్, రామగిరి బానేష్, గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899